సాక్షి
చిత్తూరు

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



గృహప్రవేశంలో విషాదం

ఆనందాల పొదరిల్లు దుఃఖంతో నిండింది. గృహ ప్రవేశం చేయాల్సిన ఆ ఇంట విషాదం విలయతాండవం చేసింది. - 8లో



మంగుంటలో తమిళనాడు బృందం

మంగుంటలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని తమిళనాడు వ్యవసాయాధికారులు, రైతులు సందర్శించారు. - 8లో



గజదాడుల్లో ఆస్తులు ధ్వంసం

వి.కోట, బంగారుపాళెం మండలాల్లో ఏనుగులు పంటలు, ఆస్తులు ధ్వంసం చేశాయి. - 8లో

న్యూస్‌రీల్

మాత్రల వాడకంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్: మాత్రలు వాడకంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని, అధిక మోతాదులో వాడితే ఆరోగ్యానికి ప్రమాదకరమని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ యాంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విచ్చలవిడిగా యాంటీ బయాటిక్ మాత్రలు వాడకూడదన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్ల వద్ద చికిత్స చేయించుకోవద్దన్నారు. వారిచ్చే మందులతో భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, వైద్యులు గోపాల్, సుదర్శన్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

నంది నృత్యోత్సవాలు రేపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో శనివారం 8వ నంది నృత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ పల్లంశెట్టి సురేష్ తెలిపారు. శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలెప్‌మెంట్ అసోసియేస్ నంద్యాల వారు కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ భారతీయ నాట్య కళలైన కూచిపూడి, భరతనాట్యం, కథాకళి, కథక్, మోహినియాట్టం, మణిపురి తదితర నాట్యకళలు ప్రదర్శిస్తారన్నారు. సుమారు 300 మంది కళాకారులతో నృత్యార్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు వేలూరు శ్రీపురం శక్తి అమ్మవారు విచ్చేయనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : ఉత్తమ పర్యాటక రంగ పురస్కారాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారి నరేంద్రబాబు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర పర్యాటక శాఖ 2024 సంవత్సరానికిగాను అవార్డులు ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ పర్యాటక రంగం అవార్డు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఈ అవార్డులకు వారసత్వ పర్యాటకం, వ్యవసాయ పర్యాటకం, శక్తివంతమైన గ్రామాలు, కమ్యూనిటీ ఆధారిత, వెల్నెస్ రంగాలకు సంబంధించిన వారు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులన్నారు. అర్హులు www.ruraltourism.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9966535697 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

27న ధర్మకర్తల మండలి సమావేశం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి పాలక మండలి సభ్యులు, ఆలయాధికారులందరు హాజరు కావాలని కోరారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



విరాళాన్ని ఆలయ అధికారులకు అందిస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళాన్ని రాజమండ్రికి చెందిన నంబూరి గోపాలకృష్ణ అందజేశారు. సాయంత్రం దాత స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి గో సంరక్షణ ట్రస్టుకు విరాళం అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,891 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,896 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపేణా హుండీలో రూ.4.04 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పేదింటికి కల్యాణమస్తు

'పెళ్లంటే బంధువుల సందడి.. అతిథి మర్యాదలు..విందు భోజనాలు.. ఇవన్నీ సాధారణమే. ఆ సంబరాల వెనుక ఎన్ని కష్టాలు ఉన్నాయో ఎవరికీ తెలియదు.. ఓ పేదింటి ఆడపడుచు తల్లిదండ్రులు పడే కష్టం.. చేసే అప్పు.. ఇవన్నీ వర్ణనాతీతం. ఆ బాధ తీర్చడానికే సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు..షాదీ తోఫా పథకాలు అమలు చేశారు. పేదల కష్టాలు తీర్చారు.' అని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప కొనియాడారు.

- జిల్లా స్థాయిలో ఘనంగా వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీ తోఫా నాలుగో విడత మంజూరు
- జిల్లా వ్యాప్తంగా 436 మందికి రూ.3.53 కోట్లు లబ్ధి
- కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రెడ్డెప్ప, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్
- లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ



లబ్ధిదారులకు మెగాచెక్కును అందజేస్తున్న ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి, వారి వివాహాన్ని గౌరవప్రదంగా జరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీ తోఫా పథకాన్ని అమలు చేస్తోందని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీ తోఫా నాలుగో విడత (2023 జులై- సెప్టెంబర్) పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కల్యాణమస్తు పథకం ఎంతో మంది పేద కుటుంబాలకు ఉపయోగపడుతోందన్నారు. ఈ పథకంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ఆయా సామాజిక వర్గాల్లో తమ పిల్లల వివాహాన్ని గౌరవప్రదంగా జరుపుకునేందుకు సర్కారు కృషి చేస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులు ఆ పథకాల గురించి మరొక్కరికి తెలియజేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. నాలుగో విడత వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీ తోఫా పథకంలో జిల్లాలోని 436 మందికి రూ.3.53 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం నేరుగా నగదును జమ చేస్తున్నట్లు తెలిపారు. ఆయా సామాజిక వర్గాల వారీగా రూ.40 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. ఇప్పటివరకు నాలుగు విడతల్లో జిల్లాలోని 1,511 మందికి రూ.11.96 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసినట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, రాష్ట్ర పాలఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమారరాజ, కార్పొరేటర్ హరిణి, డీఆర్‌డీఏ పీడీ తులసి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీ తోఫా అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. అది వారి మాటల్లోనే..

మంచి పథకం



మాకిద్దరికి 6 నెలల క్రితం వివాహమైంది. ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణమస్తు పథకం గురించి సచివాలయంలో తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్నాం. ఈ పథకంలో అందే నగదు ఉపయోగపడింది. పేదల సంక్షేమం గురించి ఆలోచిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

- పల్లవి, భానుచందర్ దంపతులు, నలగాంపల్లె, బంగారుపాళెం మండలం

పెళ్లికి చేసిన అప్పులు తీరనున్నాయి



ప్రభుత్వం అమలు చేస్తున్న సహాయంతో పెళ్లికి చేసిన అప్పులు తీరనున్నాయి. పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. మా కుటుంబానికి విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అందుతున్నాయి. వైఎస్సార్ షాదీతోఫా ఆర్థిక సహాయం మాకెంతగానో ఉపయోగపడనుంది.

- యాస్మిన్, రసూల్‌బాషా దంపతులు, చిత్తూరు

రూ. 2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం

- 60 గ్రామాలకు అందుబాటులో బుగ్గ అగ్రహారం వద్ద నిర్మాణం
- పబ్లిక్ కాంట్రిబ్యూషన్ కింద రూ.40 లక్షలు అందజేసిన మంత్రి ఆర్కే రోజా
- త్వరలో నిర్మాణానికి టెండర్లు
- మంత్రి ఆర్కే రోజా



పబ్లిక్ కాంట్రిబ్యూషన్ చెక్కును టీటీడీ చైర్మన్, ఈఓకు అందజేస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారంలో రూ. 2 కోట్ల వ్యయంతో టీటీడీ కల్యాణ మండపం నిర్మించనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. గురువారం అలిపిరి శ్రీవేంకటేశ్వర సప్త గోప్రదక్షిణశాలలో నిర్వహించిన శ్రీశ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమంలో పాల్గొన్న ఆమె కల్యాణ మండపం నిర్మాణానికి టీటీడీ నిబంధనల మేరకు చెల్లించాల్సిన 20 శాతం పబ్లిక్ కాంట్రిబ్యూషన్ రూ.40 లక్షలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈఓ ధర్మారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ నగరిలో టీటీడీ కల్యాణమండప నిర్మాణం పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజల చిర కాల కోరిక అన్నారు. అది త్వరలో నెరవేరుతుందన్నారు. మండపం నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులను టీటీడీ మంజూరు చేసిందని, అందులో నిబంధనల మేరకు చెల్లించాల్సిన 20 శాతం పబ్లిక్ కాంట్రిబ్యూషన్‌కు కూడా తాను చెల్లించినట్లు ఆమె తెలిపారు. త్వరలో టెండర్లు పిలుస్తారని, అది అయిన వెంటనే నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. 500 మంది కూర్చునేలా మ్యారేజి హాలు, ఒకసారికి 200 మంది కూర్చునేలా డైనింగ్ హాలు దానికి అనుబంధంగా కిచెన్, స్టోర్ రూము, వరుడు, వధువులకు అటాచ్డ్ బాత్రూమ్ ఉండేలా రూమ్‌లు నిర్మించనున్నట్లు చెప్పారు. బుగ్గ కాశీ విశ్వేశ్వరాలయానికి సమీపంలో నిర్మిస్తున్నందున నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన సుమారు 60 గ్రామాల ప్రజలకు ఈ మండపం ఉపయోగపడుతుందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు లోనుకాకుండా తక్కువ వ్యయంతో పెళ్లిళ్లు చేసుకునే సౌకర్యం కలుగుతుందన్నారు. పార్కింగ్‌కు ఎలాంటి సమస్య ఉండదని, ఆలయం, శంకరమఠం లాంటివి పక్కన ఉన్నందున విచ్చేసేవారికి బసతో పాటు అన్నివిధాలుగా సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇప్పటికే వడమాలపేట మండలం అప్పలాయిగుంటలో రూ.7 కోట్ల వ్యయంతో కల్యాణ మండపం నిర్మించడం జరిగిందన్నారు. పుత్తూరులో టీటీడీ కల్యాణ మండపం నవీకరించామన్నారు. రూ.1.85 కోట్ల వ్యయంతో షాదీ మహల్ నిర్మించడం జరిగిందన్నారు.

మూడు పోలీస్‌స్టేషన్ల అప్‌గ్రేడ్

చిత్తూరు అర్బన్: జిల్లాలో మూడు పోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పూతలపట్టు, గంగాధరనెల్లూరు, గంగవరం పోలీస్‌స్టేషన్లకు ఇన్‌స్పెక్టర్ స్థాయి హోదాను కల్పిస్తూ ప్రభుత్వం జీఓ నంబర్ 192ను జారీ చేసింది. స్టేషన్ల అప్‌గ్రేడ్ కోసం చిత్తూరు ఎస్పీ రిశాంత్ రెడ్డి పంపిన ప్రతిపాదన మేరకు మూడు స్టేషన్ల స్థాయి పెంచారు. ఇప్పటివరకు ఎస్‌ఐ స్థాయిలో ఉన్న మూడు స్టేషన్లలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా సీఐ స్థాయి అధికారి వ్యవహరిస్తారు. ఇక చిత్తూరులో సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ కేసు దర్యాప్తు కోసం సీఐ, ఎస్‌ఐ పోస్టులు కూడా మంజూరయ్యాయి. జిల్లా క్రైమ్ బ్యూరో రికార్డ్స్ (డీసీఆర్‌బీ)కు సైతం అధికారికంగా ఎస్‌ఐ పోస్టు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించి గెజిట్ విడుదల కాగానే ప్రభుత్వ ఆదేశాలు అమల్లోకి వస్తాయి.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో పీసీపీఎన్‌డీటీ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యానేరమన్నారు. అటువంటి పరీక్షలు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రులపై గట్టి నిఘా పెట్టాలని చెప్పారు. పక్కాగా రిజిస్టర్లు అమలు చేయాలన్నారు. వైద్యఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిత్యం తనిఖీలు చేయాలని తెలిపారు. ఫిర్యాదులు అందితే క్షేత్రస్థాయిలో విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలోని 16 మండలాల్లో ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉందని, ఈ సంఖ్య పెంచడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి, డీఐఓ రవిరాజు, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- 26, 27 తేదీల్లో ప్రధాని తిరుపతి పర్యటన
- తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ప్రధాని నరేంద్రమోదీ 26, 27వ తేదీల్లో తిరుపతి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని తిరుపతి జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, జేసీ డీకే బాలాజీ, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఆర్డీవోలు, అదనపు ఎస్పీలు, జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని 26వ తేదీ సాయంత్రం 6.55 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని రోడ్డు మార్గాన తిరుమల చేరుకుంటారని తెలిపారు. రాత్రి అక్కడే బస చేసి 27వ తేదీ ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ఉదయం 10.25 గంటలకు తిరుగు ప్రయాణమవుతారని చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటుచేయాలని, రోడ్లుకు మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ రానున్నారని వాటికి సంబంధించిన ఏర్పాట్లు చేపట్టాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లోనూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, వెంకటరావు, రాజేంద్ర, ఆర్డీవోలు నిశాంత్ రెడ్డి, కిరణ్ కుమార్, చంద్రముని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు, భవాని, ప్రొటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ బసవరాజ తదితరులు పాల్గొన్నారు.

పాడికి యంత్రసిరి

జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమే ప్రధాన జీవనాధారం. ఈ నేపథ్యంలో పాడి అభివృద్ధికి ప్రభుత్వం భరోసా ఇస్తోంది. పశుపోషకుల సంక్షేమం కోసం పలు పథకాలు..రాయితీలు అమలు చేస్తోంది. యాంత్రికీకరణలో భాగంగా పాడి రైతులకు చాఫ్‌కట్టర్లు అందజేస్తోంది. వెరసి.. పాడికి యంత్రసిరి వచ్చింది. ఫలితంగా ఈపరిశ్రమ రెండంకెల వృద్ధి సాధిస్తోంది.

- 2,835 మందికి రాయితీ చాఫ్‌కట్టర్ల పంపిణీ
- యంత్రానికి పెరుగుతున్న డిమాండ్
- రైతు భరోసా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ



జిల్లా పశుసంవర్థక ఆస్పత్రిలో ఆవరణంలోని చాఫ్ కట్టర్లు

సంవత్సరం	యంత్రాల సంఖ్య
2021–22	670
2022–23	365
2023–24	1450
ఇవ్వాల్సింది	350
మొత్తం	2,835

చిత్తూరు రూరల్: పాడి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వ్యవసాయరంగంతోపాటు పాడి పరిశ్రమ వృద్ధికి తోడ్పాటునిస్తోంది. పశువుల దాణా, పశువైద్యంతోపాటు పాడి రైతుకు అవసరమైన యంత్ర పరికరాలను రాయితీతో అందిస్తోంది. ప్రధానంగా చాఫ్‌కట్టర్ (గడ్డి కత్తిరించే యంత్రం) ఇస్తోంది. ఈ యంత్రానికి డిమాండ్ పెరుగుతోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా బుకింగ్ చేసుకుంటున్నారు.

నాడు ఆదరణ కరువు

నాలుగేళ్ల కిందటి వరకు పాడి పరిశ్రమ పూర్తిగా ఢీలా పడిపోయింది. ప్రకృతి వైపరీత్యాలు, ఆదరణ కరువై పాడి పరిశ్రమ కునారిల్లింది. అప్పటి ప్రభుత్వం నుంచి కనీసం చేయూత లేకపోవడంతో పాడి పరిశ్రమపై రైతులు పెద్దగా దృష్టి పెట్టలేకపోయారు. అలాగే పాల ధరలు అంతంత మాత్రంగానే ఉండడంతో పాడి పశువుల పెంపకంలో రాణించలేకపోయారు. దీనికి తోడు పశువైద్యం మూలనపడింది. గత ప్రభుత్వం నుంచి బీమా సౌకర్యం, పశువుదాణా, గ్రాసం వంటివి లేకపోవడంతో రైతులకు భరోసా లేకుండా పోయింది.

నేడు పాడి వృద్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పల్లెల్లో రైతు భరోసా కేంద్రాలు వెలిశాయి. ఈ కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన అన్ని విత్తనాలను అందించడంతోపాటు పాడి పరిశ్రమ వృద్ధికి అవసరమైన సేవలను అందిస్తున్నారు. రాయితీతో దాణా, విత్తనాలు, గడ్డి పెంపకానికి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. అలాగే పశువైద్య సహాయకులను నియమించి, పశువులకు వైద్య సేవలను అందిస్తున్నారు. ముఖ్యంగా రాయితీతో గడ్డి కత్తిరించే యంత్రాలను ఇస్తున్నారు. రైతులు ఈ యంత్రం కోసం క్యూకడుతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందస్తు బుకింగ్ చేయించుకుంటున్నారు. రైతులు బుకింగ్ చేయించుకున్న వెంటనే వాటిని సకాలంలో అందించే ఏర్పాట్లు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులు చూస్తున్నారు. ఈ కారణంగా జిల్లాలో పాడి పరిశ్రమ ఏటా వృద్ధి చెందుతోంది. ఫలితంగా జిల్లాలో మొత్తం 4,68,543 పశువులు ఉండగా అందులో 4,67,507 ఆవులు, 1,036 గెదేలున్నాయి. వీటి ద్వారా పాల ఉత్పత్తి అమాంతంగా పెరిగింది.

రాయితీతో చాఫ్‌కట్టర్

యంత్రాలతో గడ్డిని కత్తిరించి పశువులకు ఇవ్వడం ద్వారా అన్ని రకాల పోషకాలు లభించడంతో పాటు గడ్డి వృథా కాకుండా ఉంటుంది. ఒక్కో యూనిట్ (యంత్రం) విలువ రూ.33,970 ఉంటుంది. ఇందులో ప్రభుత్వం రాయితీ రూ.13,588 ఇస్తోంది. మిగిలిన రూ.20,382 రైతులు చెల్లించాల్సి ఉంది. గత మూడేళ్లలో 2,485 గడ్డి కత్తిరించే యంత్రాలు అందించారు. మరో 350 యంత్రాలు ఇవ్వనున్నారు. ఈ యంత్రాలు జిల్లా పశుసంవర్థక ఆస్పత్రిలో సిద్ధం చేస్తున్నారు. త్వరలో రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటిని పాడి రైతులకు అందజేయనున్నారు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం రూ.3.85 కోట్లు భరించిందని పశుసంవర్థక శాఖ అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఇంకా కావాల్సి వస్తే మరింత మంది రైతులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. ఆర్బీకేల ద్వారా బుకింగ్ చేసుకోవచ్చునన్ని వారు అంటున్నారు.

కావాల్సిన రైతులందరికీ ఇస్తాం..



గతంలో ఒక ఆవు ఉన్న వ్యక్తి.. ఇప్పుడు రెండు..మూడేసి ఆవులు మేపుతున్నారు. మరి కొంత మంది షెడ్డులు వేసుకుని 15 నుంచి 20 ఆవులు పోషిస్తున్నారు. వాటిని మేపడానికి పచ్చిగడ్డి పొలాల్లోని నాటుకుని..మేత భారాన్ని తగ్గించుకుంటున్నారు. ఈ గ్రాసం వృథా కాకుండా ఉండేందుకు ఈ చాఫ్ కట్టర్ ఉపయోగకరంగా మారింది. రైతులు కట్టర్ కోసం స్వచ్ఛందగా ముందుకు వస్తున్నారు. కావాల్సిన రైతులందరికీ రాయితీతో కట్టర్ అందిస్తున్నాం. ఇంకా కావాల్సిన వారికీ ఇస్తాం. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

- ప్రభాకర్, పశుసంవర్థకశాఖ, జేడీ

సామాజిక బస్సుయాత్ర వాయిదా



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 25వ తేదీన శనివారం జరగాల్సిన వైఎస్సార్‌సీపీ సామాజిక, సాధికారిక బస్సుయాత్ర వర్షాల కారణంగా రద్దు చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే వెంకటేగౌడ, నియోజకవర్గ నాయకులతో కలసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా ఇబ్బందులున్న నేపథ్యంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల మేరకు స్థానిక నాయకులతో చర్చించి, ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలో నిర్వహించే కార్యక్రమం తేదీని త్వరలో వెల్లడించనున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రంగన్న, మురళీకృష్ణ, ఎంపీపీలు మొగలసాల రెడ్డెప్ప, యువరాజు, మండల కన్వీనర్లు జాఫర్, మోహన్‌రెడ్డి, మాజీ కన్వీనర్ మండీ సుధ, మున్సిపల్ వైస్ చైర్మన్ రాగిపాళెం రవి, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

26న రిజర్వేషన్లపై అవగాహన సదస్సు

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్ అంశంపై ఈనెల 26వ తేదీన తిరుపతిలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు శేషాద్రి, సతీష్, రంగారావు గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆ రోజు తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ఆల్ ఇండియా ఈ క్వాలిటీ ఫోరం న్యూఢిల్లీ జాతీయ అధ్యక్షులు నాగరాజు హాజరావుతారన్నారు.

జాతీయస్థాయి టెన్నిస్ పోటీలకు సాయి సంజన


సాయిసంజనరెడ్డి

పూతలపట్టు: మండలంలోని మంగల్ విద్యాలయ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి సాయిసంజనరెడ్డి అండర్– 14 టెన్నిస్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు కాకినాడలో జరిగిన 67వ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ టోర్నమెంట్‌లో సాయిసంజన రెండో స్థానం సాధించిందని తెలిపింది. దీంతో ఈమె వచ్చే జనవరిలో షోలాపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరపున ఆడుతారని పేర్కొంది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థి సాయిసంజనరెడ్డిని అభినందించింది.

పీహెచ్‌సీకి ఈసీజీ పరికరాలు


ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవిరాజు

పూతలపట్టు: స్థానిక పీహెచ్‌సీకి ప్రభుత్వం ఈసీజీ పరికరాలు అందజేసిందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవిరాజు తెలిపారు. గురువారం మండలంలోని పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోనే వైద్యం చేయించుకోవచ్చని తెలిపారు. అందుకు కావాల్సిన పరికరాలు పీహెచ్‌సీలోనే అందుబాటులో ఉన్నాయన్నారు. గుండెకు సంబంధించిన వ్యాధులతో బాధపడే వారు బయట ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవడం కన్నా, పీహెచ్‌సీల్లో చేసుకోవడం మేలన్నారు. ప్రజలు ఆరోగ్య కేంద్రంలోనే ఉచితంగా పరీక్షలు చేసుకోవచ్చని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రియాంక, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, శరవణ పాల్గొన్నారు.

పల్లె వాకిటే పత్రాలు

పల్లెవాసులు.. రెక్కాడితేకానీ డొక్క నిండని బతుకులు వారివి. రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదు. ప్రస్తుతం పలు విషయాలకు వివిధ ధ్రువపత్రాలు అవసరం.. అయినా తెచ్చుకోలేని దుస్థితి. ఎవరిని అడగాలి.. ఎలా తెచ్చుకోవాలి అన్న మీ మానస.. ఇలా కొట్టుమిట్టాడుతున్న తరుణంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంతో పల్లె వాకిటకే 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా ఎలాంటి వ్యయ, ప్రయాసలు లేకుండా వచ్చి వాలాయి. అధికారులే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంపై లబ్ధిదారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి మాటల్లోనే...

జనవాక్కు


జగనన్న సురక్ష శిబిరంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజాపతినిధులు

ఒక్క రోజులోనే సమస్య పరిష్కారం



నేను గంగవరం మండలం కీలపట్ల దళితవాడలో నివాసం ఉంటున్నాను. మేము మా అత్తమామలు, భర్త, పిల్లలు, అందరూ కలిపి ఒకే రేషన్ కార్డులో ఉండేవాళ్లం. రెండేళ్ల క్రితం రేషన్ కార్డు విభజనకు సచివాలయంలో అర్జీ పెట్టుకున్న కొత్త కార్డు వచ్చిందే కానీ వలంటరీ లాగిన్‌లో మాత్రం అందరూ ఒకే కార్డులో ఉన్నట్టుగా చూపించేది. అనేకసార్లు సచివాలయంలో, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద స్పందనలో అర్జీ పెట్టుకున్న సమస్య పరిష్కారం కాలేదు. ఏడాది క్రితం కరోనా సమయంలో నా భర్త మృతి చెందగా వితంతు పింఛన్ కోసం అర్జీ పెట్టుకుంటే అందరూ ఒకే కార్డులో ఉన్నట్టు చూపించడంతో పింఛన్ మంజూరు కాలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లగా ఒక్కరోజులో సమస్య పరిష్కరించారు. దీంతో నాకు పింఛన్ మంజూరైంది. ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– గౌరమ్మ, లబ్ధిదారు, కీలపట్ల.

మా ఇంట్లో ముగ్గురికి ధ్రువీకరణ పత్రాలు



మాది నగరి మున్సిపాలిటీ. మా ఇంట్లో ముగ్గురికి సురక్ష పథకంలో ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందాయి. వలంటీరు, గృహ సారథి, కౌన్సిలర్, సచివాలయ సిబ్బంది అంటూ అందరూ మా ఇంటి వద్దకే వచ్చి, 11 రకాల సేవలు ఉచితంగా అందజేస్తున్నాం. మీకు ఏది అవసరమో చెప్పండి.. మేము తెచ్చి ఇస్తామని, అడిగి మరీ సర్టిఫికెట్ తెచ్చి ఇచ్చారు. ఎలాంటి రుసుము లేకుండా మాకు సర్టిఫికెట్లు అందాయి. ఇంత సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– కెఎస్ యశోద, లబ్ధిదారు, నగరి

ఇంటివద్దకే వచ్చి ఇచ్చారు



మాది ఐరాల మండలం చిన్నవెంకటటంపల్లె. నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. వలంటీర్ మా ఇంటికి వచ్చి సచివాలయంలో వివరాలు ఇవ్వమంటే ఇచ్చేశా. రెండు రోజులకే ఫోన్ చేశారు. వెళ్లి ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రం అందుకున్నాను. టీడీపీ హయాంలో కుల ధ్రువీకణ పత్రం కావాలంటే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. అయినా పని అయ్యేది కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రాష్ట్రంలో మంచి పరిపాలన కొనసాగుతోంది.

– మంజుల, లబ్ధిదారు, ఐరాల

గతంలో దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదు



కుల, నివాస ధ్రువీకరణ పత్రం కోసం గతంలో మీసేవలో దరఖాస్తు చేసుకున్నాను. ఏదో ఒక కారణం చెప్పి మంజూరు కాలేదని చెప్పి పంపించేశారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అడిగితే అక్కడా మీసేవ కేంద్రానికి వెళ్లమన్నారు. ఒకరిపై...మరొకరు చెప్పుకున్నారే తప్ప నాకు ధ్రువపత్రం మాత్రం మంజూరు చేయలేదు. విసిగిపోయి వొద్దు అనుకుని ఉండిపోయాను. ఇప్పుడు ఇంటి వద్దకే వచ్చి నాకు అవసరమైన ధ్రువపత్రాలను తెచ్చిచ్చారు. చాలా సంతోషంగా ఉంది. సీఎం జగనన్న వల్లే ఇలాంటి మంచి పనులు సాధ్యపడుతున్నాయి.

– ఉమ, ఆముదాల దళితవాడ, పాలసముద్రం మండలం

పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

- పీఎంపీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకర్


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకర్

కాణిపాకం(యాదమరి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని రిస్క్‌తో కూడిన వైద్యం చేయకూడదని కమ్యూనిటీ పారా మెడికల్ ప్రైమరీ హెల్త్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు తోరాటి ప్రభాకర్ సూచించారు. గురువారం కాణిపాకంలోని ప్రైవేటు భవనంలో ఉమ్మడి జిల్లాలోని పీఎంపీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న పీఎంపీలు రోగులకు ప్రథమ చికిత్సమాత్రమే చేయాలన్నారు. అలా కాకుండా రిస్క్‌తో కూడిన వైద్యం చేస్తే సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రిస్క్‌తో కూడిన రోగులు వస్తే వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేయాలన్నారు. అనంతరం పీఎంపీల జిల్లా ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా మన్నారు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణమ్మ జనార్దన్, కోశాధికారిగా భూపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పీఎంపీలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే తమను సంప్రదించాలని కోరారు. అందరి సమస్యలు పరిష్కారానికి ముందుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



చరణ్ మృతదేహం, ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

బంగారుపాళెం: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో మాధవనగర్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరో విద్యార్థి గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. తవణంపల్లె మండలం మొట్టుకూరు దళితవాడకు చెందిన దేవరాజులు కుమారుడు చరణ్ (20), ఆటోడ్రైవర్, ఎం గొల్లపల్లెకు చెందిన జయచంద్రారెడ్డి కుమారుడు పూర్ణేష్(14) బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇద్దరు ద్విచక్రవాహనంపై బంగారుపాళేనికి వస్తుండగా మార్గ మధ్యంలో మాధవనగర్ వద్ద మదనపల్లె నుంచి చిత్తూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో చరణ్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పూర్ణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, క్షతగాత్రుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


వనరాజునాయుడు(ఫైల్)

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరాజుపురంలో పొలం వద్ద విద్యుత్ తీగలు సరిచేస్తున్న సమయంలో విద్యుత్ షాక్ కొట్టి ఓ రైతు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీకావేరిరాజుపురం గ్రామానికి చెందిన వనరాజులనాయుడు (65) వరి పంట సాగు కోసం దుక్కి చేయడానికి విద్యుత్ మోటారు స్టార్టర్ వద్ద తెగిపోయిన విద్యుత్ తీగలు ట్రాన్స్‌కో సిబ్బంది సమాచారం అందించకుండానే సరిచేయడానికి పూనుకున్నాడు. విద్యుత్ లేని సమయంలో ఇంట్లో కురగాయలు తరిగే కత్తితో తెగిపోయిన విద్యుత్ తీగను సరిచేస్తుండగా విద్యుత్ సరఫరా రావడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

కన్నీళ్లే మిగిలాయి!

- ఇసుక గుంతలో చిక్కుకుని వ్యక్తి మృతి
- తల్లడిల్లిన నలుగురు కుమార్తెలు

కోట: ఇసుకగుంతలో చిక్కుకుని ఎడ్లబండి యజమాని మృతిచెందిన సంఘటన గురువారం గూడలి వద్ద స్వర్ణముఖినదిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. గూడలి అరుంధతీవాడకు చెందిన పొల్లుల మస్తాన్(40) ఎడ్లబండి ద్వారా ఇసుక తోలుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. రోజూలాగే ఇతర బండ్లతో కలిసి స్వర్ణముఖిలోకి వెళ్లాడు. ఇసుకను నింపుకుని వెలుతున్న క్రమంలో కొందరు జేసీబీతో బండ్లు వెళ్లకుండా లోతుగా గాడి తీసినట్లు గుర్తించారు. ఒక్కొక్కరుగా తమ ఎడ్లబండ్లను గాడిని తప్పించి బయటకు తీసుకువస్తున్న క్రమంలో మస్తాన్ ఎడ్లబండి గాడిలో ఇరుక్కుని ఒరిగింది. ఎద్దులు పట్టుతప్పడంతో మస్తాన్ అదే గుంతలో పడి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. తోటి బండ్ల వారు గుర్తించేలోపే మస్తాన్ మృతి చెందాడు. అరుంధతీ కాలనీ వాసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎడ్లబండ్లు వెళ్లకుండా గాడి తీసిన గూడలికి చెందిన కేశవరెడ్డితో వాగ్వాదానికి దిగారు. అతని ఇంటి ముందు మస్తాన్ మృతదేహంతో ఆందోళన చేపట్టారు. మృతుని కుటుంబానికి న్యాయం చేసే వరకు కదిలేది లేదని భీష్మించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పుల్లారావు అక్కడికి చేరకుని సర్దుబాటు చేయడంతో మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించారు.

కలచివేసిన ఆడపిల్లల రోదన

మృతుడు మస్తాన్‌కు భార్య బుజ్జమ్మ, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె మన్విత ఇంటర్ చదువుతుండగా.. మిగతా ముగ్గురూ రమ్య–10, రుతిక–8, అవంతి–5వ తరగతి చదువుతోంది. అనుకోని ప్రమాదంలో పెద్ద దిక్కును కోల్పోవడంతో మృతదేహంపై పడి వారు రోదిస్తున్న తీరు అందరినీ కలచి వేసింది. ఇంక మాకు దిక్కెవరంటూ ఆడపిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంగుంటలో తమిళనాడు బృందం


ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో మాట్లాడుతున్న తమిళనాడు వ్యవసాయాధికారులు

శ్రీరంగరాజపురం : మండలంలోని మంగుంట గ్రామంలో రైతు శేషాద్రికి చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని తమిళనాడు రాష్ట్ర వ్యవసాయాధికారులు, రైతులు జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి వాసు ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి వాసు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయనికి అధిక ప్రాధాన్యత కల్పించి, రైతులకు నాణ్యమైన విత్తనాలను రాయితీతో అందిస్తున్నారని చెప్పారు. పంట సాగుకు ముందే పొలంలో నవ ధాన్యాలను చల్లి 40 రోజుల తర్వాత కాయ, పిందె దశలో వాటిని భూమిలో కలియదున్నడంతో భూమి సారవంతమవుతుందన్నారు. ఆ తరువాత వేరుశనగ, చెరుకు, వరి, కూరగాయాలు తదితర పంటలు సాగు చేయడంతో అధిక దిగుబడి సాధిస్తున్నారని చెప్పారు. అనంతరం తమిళనాడు అధికారులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం విధానంపై తమ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేసి, ఇక్కడ అందుతున్న సేవలను తెలియజేసి, రైతులకు శిక్షణ ఇచ్చి, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి నర్మద, తమిళనాడు రాష్ట్ర అధికారి తిలగవతి, గోపాల్, ప్రసన్న, సురేష్, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

మంగళ విద్యావాణి మాసపత్రిక ఆవిష్కరణ


మాసపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిర్వహించే మంగళవిద్యావాణి మాసపత్రికను కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఆవిష్కరించారు. బంగారుపాళెం మండలంలోని మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయబృందం గురువారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మాసపత్రికను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్‌ఎంలు హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, సంజీవి, పిల్లారప్ప, గణిత ఉపాధ్యాయుడు అరుణశివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న వైద్యాధికారులు

చెక్కు అందజేత

గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు అందజేసిన ఆర్థిక సహాయం మెగాచెక్కును వైద్యాధికారులు కలెక్టర్ షణ్మోహన్‌కు గురువారం అందజేశారు. టీబీ,ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సహాయార్థం గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు రూ.1.20 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారని వైద్యశాఖ అధికారులు వెల్లడించారు. అందజేసిన ఆర్థిక సహాయంతో వ్యాధిగ్రస్తులకు సహాయక చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి, డీఐఓ రవిరాజు, తదితరులు పాల్గొన్నారు.

గజదాడుల్లో పంటలు, ఆస్తులు ధ్వంసం


కీరమందలో పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ, సమగ్ర శిక్ష అభియాన్ పీడీ


ధ్వంసమైన బీన్స్ పంట

- కీరమంద స్కూలు కిటికీలు, తలుపులు ధ్వంసం
- వి.కోట మండలంలో పంటలకు నష్టం

బంగారుపాళెం: వి.కోట, బంగారుపాళెం మండలాల్లో ఏనుగులు పంటలు, ఆస్తులు ధ్వంసం చేశాయి. వివరాల్లోకి వెళితే.. బంగారుపాళెం మండలంలోని కీరమంద ప్రాథమికోన్నత పాఠశాల కిటికీలు, తలుపులను బుధవారం రాత్రి ఏనుగులు ధ్వంసం చేశాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కీరమంద గ్రామానికి సమీపంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. బుధవారం రాత్రి ఈ పాఠశాల ఆవరణలోకి ఏనుగులు ప్రవేశించాయి. వంట గదికి కిటికీలు, తలుపులు తొండంతో తొలగించాయి. వంట గదిలో మూడు బస్తాల బియ్యం, రాగి జావకు వాడే రాగిపిండి, ఇతర వస్తువులను ధ్వంసం చేశాయి. గురువారం ఉదయం పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎం హమీద్, ఉపాధ్యాయులు ఈ విషయం గుర్తించి ఎంఈఓ నాగేశ్వర్‌రావుకు సమాచారం అందజేశారు. ఆయన డీఈఓకు సమాచారం అందించారు. డీఈఓ విజయేంద్రరావు, సమగ్ర శిక్ష అభియాన్ పీడీ వెంకటరమణారెడ్డి హుటాహుటిన కీరమంద ప్రాథమికోన్నత పాఠశాల వద్దకు వచ్చి, ఏనుగుల ధ్వంసం చేసిన పాఠశాల వంటగది కిటికీలు, తలుపులను పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి నివేదికలు పంపాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, హెచ్‌ఎంను ఆదేశించారు. అటవీశాఖ సిబ్బంది పద్మావతి పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల గుంపు దాడి

వి.కోట: ఏనుగుల గుంపు పంటలపై దాడి చేసి, ధ్వంసం చేసిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం మేరకు.. మండలంలోని కుమ్మరమడుగు, దానమయ్యగారిపల్లె, వెంకటేపల్లె, ఎడగురికి గ్రామాలకు చెందిన రైతుల పంటలపై బుధవారం రాత్రి 15 ఏనుగుల గుంపు దాడి చేసింది. కుమ్మరమడుగు గ్రామంలోని రైతు సుబ్బన్నకు చెందిన బీన్స్ తోట, శివప్ప సాగు చేసిన మొక్కజొన్న పంటలను తొక్కి నాశనం చేశాయని బాధితులు వాపోయారు. అలాగే ఎడగురికి గ్రామానికి చెందిన రాజన్న అనే రైతుకు చెందిన 2 ఎకరాల అరటితోటను తొక్కేశాయని రైతు ఆవేదన చెందాడు. దాదాపు రూ.4 లక్షల విలువ చేసే పంటలను నాశనం చేశాయని బాధిత రైతులు వాపోతున్నారు. పరిహారం ఇచ్చి తమను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గృహప్రవేశంలో విషాదం


ప్రమాదం జరిగిన ఇంటి మేడ

- విద్యుత్ షాక్‌తో మామ, అల్లుడి మృతి
- గ్రామంలో విషాదఛాయలు



రాజేష్(ఫైల్) భాస్కర్ మృతదేహం

నింద్ర : ఆనందాల పొదరిల్లు దుఃఖంతో నిండింది. సంతోషంగా గృహ ప్రవేశం చేయాల్సిన ఆ ఇంట విషాదం విలయతాండవం చేసింది. కలకాలం బాగుండాలని ఆశీర్వదించడానికి వచ్చిన బంధువులు కడసారి చూపులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మామ అల్లుళ్ల మృత్యు ఒడికి చేరడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటన నింద్ర మండలం ఇరుగువాయి దళితవాడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...

నింద్ర మండలంలోని ఇరుగువాయి దళితవాడకు చెందిన రాజేష్, మధుబాల ఎంతో ఇష్టపడి కట్టుకున్న ఇంటికి గురువారం గృహప్రవేశం చేయాలని నిర్ణయించుకున్నారు. అయినవాళ్లను, బంధువులను ఆహ్వానించారు. అల్లుడు, కుమార్తెకు గృహప్రవేశ పనుల్లో తోడుగా ఉండి సహకారం అందించడానికి తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టులో నివాసముండే మామ భాస్కర్ ముందుగా వచ్చి గృహప్రవేశ పనుల్లో నిమగ్నమయ్యాడు. బుధవారం సాయంత్రం రాజేష్ ఇంటి మేడపై షామియానా వేసే నిమిత్తం వెళ్లాడు. దానికి అవసరమైన ఇనుప కమ్మీలను ఎక్కిస్తుండగా అవి పైన వెళుతున్న 11 కేవీ వైర్లకు తగిలి షాక్‌కు గురయ్యాడు. షాక్‌లో మామా.. మామా.. అని కేకలు పెట్టడంతో మామ భాస్కర్ హుటాహుటిన అతని వద్దకు వెళ్లి ఎలాగైనా కాపాడాలన్న ఆతృతలో అతన్ని పట్టుకుని లాగే ప్రయత్నం చేశాడు. దీంతో ఇరువురు షాక్‌కు గురై తీవ్రగాయాలపాలయ్యారు. వారిని వెంటనే నగరి ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే పరిస్థితి విషమించడంతో అర్ధరాత్రి మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం రాజేష్ (33), భాస్కర్ (48) మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు.

ఆ ఇల్లాలి శోకం వర్ణనాతీతం

కాసేపటి వరకు కళ్లముందే తిరిగిన భర్త, కన్న తండ్రి కొన్ని గంటల వ్యవధిలో విగత జీవులుగా మారడంతో మధుబాల వేదన వర్ణనాతీతం. అయిన వాళ్లు ఇక రారన్న వార్తను ఆ ఇల్లాలు జీర్ణించుకోలేకపోయింది. ఆమెను వారించడం ఎవరితరమూ కాలేదు. తనకంటూ ఇక ఎవరున్నారంటూ ఆమె విలపించడం అందరినీ కన్నీరు పెట్టించింది. ఆమెకు ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు.